ప్రజాశక్తి
సోమవారం 15 సెప్టెంబర్ 2025
5
పార్వతీపురం మన్యం

నేటి నుంచి యుటిఎఫ్ రణభేరి

వీరఘట్టం : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 15 నుంచి 19 వరకు యుటిఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న బైకు జాతాను జయప్రదం చేయాలని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి మజ్జి పైడిరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 12వ పిఆర్‌సి ప్రకటించాలని, పిఆర్‌సి ప్రకటించే వరకు 29 శాతం మధ్యంతర భృతి ఇవ్వాలని, పెండింగ్లో ఉన్న నాలుగు డిఎలు విడుదల చేయాలని, పేరుకుపోయిన రూ.వేల కోట్లు ఆర్థిక బకాయిలు తక్షణమే చెల్లించాలని, సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని, ఉమ్మడి సర్వీస్ రూల్స్ ద్వారా ప్రమోషన్ ఇవ్వాలని, పాఠశాలలో ఒత్తిడి లేకుండా పనిచేసే వాతావరణం కల్పించాలని, ఉపాధ్యాయులకు బోధనేతర పనులు నుంచి విముక్తి కల్పించాలని, అస్తవ్యస్తంగా ఉన్న వ్యవస్థీకరించిన పాఠశాలల వ్యవస్థను సరిచేయాలని డిమాండ్ చేస్తూ ఈ ర్యాలీ చేపట్టనున్నట్టు తెలిపారు. కావున ఉపాధ్యాయులంతా ఈ ర్యాలీ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ప్రాధాన్యతా రంగాలను గుర్తించాలి

- సిఐటియు బలోపేతానికి కృషి చేయాలి
- జిల్లా మహాసభలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగరావు

మహాసభలో మాట్లాడుతున్న నర్సింగరావు

ప్రజాశక్తి -పార్వతీపురం/పాలకొండ

జిల్లాలోని ప్రాధాన్యతా రంగాలను గుర్తించి సంఘం బలోపేతానికి కృషి చేయాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు పిలుపునిచ్చారు. సందర్భంగా పాలకొండలోని గాయత్రి కల్యాణ మండపంలో జరుగుతున్న సిఐటియు 11వ జిల్లా మహాసభ రెండో రోజు ఆదివారం నిర్వహించిన ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలోగాని, రాష్ట్రంలో గానీ ప్రభుత్వాలను నిలదీయాలంటే సిఐటియు ఒక్కటే మొనగాడిగా నిలుస్తోందన్నారు. అయితే ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలను నిలదీయడానికి వ్యూహం వుండాలని చెప్పారు. దీని కోసం జిల్లాలోని రవాణా, విద్యుత్ రంగాలను ఎన్నుకోవాలని సూచించారు. విద్యుత్ సరఫరా ఒక గంట నిలిచిపోతే మనిషి బతకలేని పరిస్థితి కనిపిస్తోందన్నారు. ఇలాంటి కీలకమైన రంగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులతో కలిసి పోరాడితే ప్రభుత్వాలు కూలిపోతాయని చెప్పారు. విద్యుత్ రంగాన్ని ప్రయివేటీకరిస్తే ఆ శాఖలో పనిచేస్తున్న చిరు ఉద్యోగుల నుంచి ఉన్నతాధికారుల వరకు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. ప్రధాని మోడీ సొంత నియోజకవర్గం వారణాసిలో విద్యుత్ ప్రయివేటీకరణను ఉద్యోగులు తీవ్రంగా ప్రతిఘటించారని చెప్పారు. తోపుడు బండ్ల వ్యాపారులు రోడ్డు పక్కన పెట్టి వ్యాపారం చేసుకునే హక్కు ఉందన్నారు. గ్రామాల్లోని ఆటో, భవన నిర్మాణ కార్మికులను సమీకరించి వారి సమస్యలు పరిష్కారానికి పోరాటాలు చేయాలన్నారు. రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగా ఏ ఉద్యోగిని తొలగించకూడదని చెప్పారు. జిల్లాలోని బలిజిపేట మండలం అరసాడలో ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికుల తొలగింపుపై హైకోర్టు ఉత్తర్వులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై జిల్లా అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. టిడిపి ప్రభుత్వ హయాంలో ప్రజా సంఘాల నిరసనలపై నిర్బంధాలు ఎక్కువయ్యాయని చెప్పారు. రాజ్యాంగంలో నిరసన తెలిపే హక్కు వుందని, దాన్ని కాదనే హక్కు ఏ ప్రభుత్వానికి లేదన్నారు. సిఎం చంద్రబాబు నాయుడు, మాజీ సిఎం జగన్ మోహన్ రెడ్డి కేసుల భయంతోనే మోడీకి దాసోహమయ్యారని విమర్శించారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని దౌర్భాగ్య పరిస్థితి ఎపిలో వుందన్నారు. టిడిపి, జనసేన, వైసిపిలు మోడీ చంకలో వున్నాయని చెప్పారు. విశాఖ ఉక్కు ప్రయివేటీకరణను అడ్డుకోవడంలో సిఐటియు ఆధ్వర్యాన కార్మికుల పోరాటాలే కీలకపాత్ర పోషిస్తున్నాయని చెప్పారు. నాలుగేళ్లుగా విశాఖ ఉక్కు ప్రయివేటీకరణకు ప్రయత్నిస్తున్న మోడీ ప్రభుత్వం కార్మికుల ప్రతిఘటనతో వెనకడుగు వేస్తోందని చెప్పారు. కార్మికులను కదిలిస్తే ఎలాంటి ఉద్యమాలనైనా నిర్మించవచ్చునని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాలని, పెరుగుతున్న విద్యుత్ ఛార్జీలపై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. కార్మికుల పోరాటానికి హిట్లర్ లాంటి నియంతలే మట్టిలో కలిసి పోయారని చెప్పారు. సిఐటియు రాష్ట్ర కార్యదర్శి సుబ్బరావమ్మ మాట్లాడుతూ దేశంలో కార్మికోద్యమాల దశ, దిశ నిర్దేశించే సిఐటియు జాతీయ మహాసభలు తొలిసారి ఉత్తరాంధ్రలో జరుగుతున్నాయని చెప్పారు. 27 రాష్ట్రాల నుంచి కార్మిక సంఘాల నాయకులు, చైనా, వియత్నాం, క్యూబా దేశాల కార్మిక ప్రతినిధులు మహాసభలకు హాజరు కానున్నారని చెప్పారు. డిసెంబర్ 31 నుంచి జనవరి 4 వరకు నిర్వహించనున్న మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. మహాసభలో సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు, ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మధరావు, కార్యదర్శి వి.ఇందిర, నాయకులు ఎన్‌వై నాయుడు, బివి రమణ, గొర్లె సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంఘాల సౌహార్ద సందేశం

ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు కె.రామస్వామి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రెడ్డి ఈశ్వరరావు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి.అఖిల్, డివైఎఫ్ఐ నాయకులు పి.రాజశేఖర్ తదితరులు ప్రతినిధుల సభలో సౌహార్ద సందేశాన్ని అందించారు.

పలు తీర్మానాలు

మహాసభలో సభ్యులు పలు తీర్మానాలకు ఆమోదం తెలిపారు. వీటిలో కొన్ని...

అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, వేతనాలు పెంచాలని, గ్రాడ్యుటీ, పెన్షన్ సౌకర్యం కల్పించాలని తీర్మానం చేశారు. అనేక యాప్‌లు అమలు చేయడం వల్ల పనిభారం పెరిగిందని, వీటిని తొలగించాలన్నారు.

కార్మిక, ప్రజా ఉద్యమాలపై నిర్బంధానికి వ్యతిరేకంగా తీర్మానించారు. ఇటీవల పార్వతీపురంలో ఉద్యమాల చేపట్టేందుకు పోలీసులు కనీసం అనుమతులు ఇవ్వడంలేదు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలపడం ప్రాథమిక హక్కు. ఈ హక్కును నిలువరించడం రాజ్యాంగ విరుద్ధమని తీర్మానించారు.

శ్రామిక మహిళల సమస్యలను పరిష్కరించాలని, పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల నిరోధక చట్టం అమలు చేయాలి తీర్మానించారు. అభివృద్ధి, సంపద సృష్టిలాంటి పేరుతో మహిళలచే రాత్రిపూట పనిచేయిస్తున్నారు. పురుషులతో సమానంగా పనిచేస్తున్న సమానవేతనం ఇవ్వడం లేదు. పనిచేసే ప్రదేశాల్లో విశ్రాంతి గదులుండాలని చట్టం చెబుతున్నా ఎక్కడా కానరావడంలేదు. ఇపిఎఫ్, ఇఎస్ఐ వంటి చట్టపరమైన హక్కుల్లేకుండా పనిబారం పెంచి మహిళలచే గొడ్డు చాకిరీ చేయించుకుంటున్నారు.

గ్రామ రెవెన్యూ వ్యవస్థలో తలయారీలుగా, గ్రామసేవకులు, రెవెన్యూ సహాయకులుగా పని చేస్తున్న ఉద్యోగులకు పేస్కేల్ అమలు చేయాలని తీర్మానించారు. అర్హులైన విఆర్ఎలకు ఉద్యోగోన్నతులు కల్పించాలని, వారి సమస్యలను పరిష్కరించాలన్నారు.

వీటిలో పాటు జిల్లాలో రైతాంగ సమస్యలు పరిష్కరించాలి, ఆటో డ్రైవర్లకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని, భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులందర్నీ పర్మిట్ చేయాలని తీర్మానించారు.

సిఐటియుజిల్లా నూతన కమిటీ ఎన్నిక

అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా రమణారావు, మన్మథరావు

రమణారావు

మన్మథరావు

మహాసభ అనంతరం 47మంది సభ్యులతో నూతన జిల్లా కమిటీ ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా డి.రమణారావు, ప్రధాన కార్యదర్శిగా వై.మన్మథరావు, జిల్లా కోశాధికారిగా గొర్లి వెంకటరమణ, జిల్లా కార్యదర్శులుగా బివి రమణ, ఎన్.వై.నాయుడు, ఎం.ఉమామహేశ్వరి, వి.రామలక్ష్మి, జి.జ్యోతిలక్ష్మి, వై.శాంతికుమారి, జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డి వేణు, ఆర్.రాము, వి.ఇందిరా, ఎం.శివాని, ఎన్.హిమప్రభతో పాటు మరో 33 మంది జిల్లా కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

మహాసభలో మాట్లాడుతున్న సినీనటుడు నారాయణమూర్తి

కార్మిక చట్టాల రద్దు దుర్మార్గం

విప్లవ సినీనటుడు నారాయణమూర్తి

ఎన్నో పోరాటాలతో సాధించుకున్న కార్మిక చట్టాలను మోడీ ప్రభుత్వం రద్దు చేయడం దుర్మార్గమని సినీనటుడు ఆర్.నారాయణమూర్తి అన్నారు. పాలకొండ పట్టణంలో జరుగుతున్న సిఐటియు 11వ జిల్లా మహాసభల సందర్భంగా ఆదివారం నిర్వహించిన సిఐటియు ప్రతినిధుల సభకు ఆయన హాజరయ్యారు. యూనివర్శిటీ పేపర్ లీక్ సినిమా ప్రమోషన్‌లో భాగంగా పాలకొండకు వచ్చిన నారాయణమూర్తి సభకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్‌లను కార్మికులు ఐక్యంగా ప్రతిఘటించాలని సూచించారు. ప్రపంచ కార్మికులారా ఏకం కండి అనే నినాదంతో కార్మికులు పోరాడిన చందంగానే కమ్యూనిస్టు పార్టీలు కూడా ఐక్యమై పోరాడాలని పిలుపునిచ్చారు. ప్రపంచీకరణలో భాగంగా కార్పొరేట్ కంపెనీలు అన్ని రంగాలను ఆక్రమిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మోడీ ప్రభుత్వం బలవంతంగా ప్రజావ్యతిరేక విధానాలను రుద్దుతోందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కార్మికులు ఐక్య పోరాటాలు చేయకపోతే హక్కులు కోల్పోతారని హెచ్చరించారు. దేశంలో కమ్యూనిస్టు పార్టీలు బాగా పని చేస్తున్నాయన్నారు. ఎర్రజెండాలన్నీ ఒకే అజెండాతో పోరాడితే ఢిల్లీ ఎర్రకోట కార్మికుల వశమవుతుందని చెప్పారు. అనంతరం తన సినిమాల్లో పాటలతో ఉర్రూతలూగించారు.

కెజిబివిలో గందరగోళం

- ఎస్ఒ సస్పెన్షన్ తర్వాత ఎవరికి వారే యమునా తీరు
- ఇన్‌ఛార్జి ఎస్ఒ రాజీనామా
- బియ్యం మెక్కిన అవినీతి పందికొక్కులు

ప్రజాశక్తి - పార్వతీపురం

సాలూరు మండలంలో కరాసువలస కెజిబివిలో గందరగోళం నెలకొంది. కొద్ది నెలల క్రితం గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి కెజిబివిని ఆకస్మికంగా తనిఖీ చేసిన తర్వాత చోటు చేసుకున్న పరిణామాలు పాఠశాలలో ఎవరికి వారే యమునా తీరు అన్న చందంగా తయారయ్యాయి. పాఠశాలలో విద్యార్థినులకు సరిపడే స్థాయిలో నాణ్యమైన భోజనం పంపిణీ చేయడం లేదని మంత్రి పరిశీలనలో బయటపడింది. ఆమె పర్యటన తర్వాత కొద్ది రోజులకు నలుగురు వంటమనుషులను, ఎస్ఒ ప్రశాంతిని సస్పెండ్ చేస్తూ జిల్లా అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఆ తర్వాత పాఠశాల ఇంఛార్జి ఎస్ఒగా మేథ్స్ లెక్చరర్ షబ్నం బేగంను నియమించారు. పట్టణానికి చెందిన ఓ టిడిపి నాయకుడి సిఫార్సు మేరకు షబ్నం బేగంకు ఇన్‌ఛార్జి ఎస్ఒ బాధ్యతలు అప్పగించినట్లు తెలిసింది. అయితే గడిచిన రెండు నెలల్లో పాఠశాలలో తలెత్తిన పరిస్థితులపై ఎస్ఎస్ఎ అధికారులు ఎప్పటికప్పుడు గమనిస్తూనే ఉన్నారు. పాఠశాలను ఆకస్మికంగా తనిఖీలు చేసి బయటపడిన అంశాలను ఉన్నతాధికారులకు నివేదిస్తున్నారు. మంత్రి సంధ్యారాణి తనిఖీ చేయడానికి ముందున్న పరిస్థితుల కంటే అధ్వాన్నంగా పాఠశాలలో పరిస్థితి తయారైంది. ఉపాధ్యాయులు గ్రూపులుగా ఏర్పడి కెజిబివి ప్రతిష్టని దిగజార్చారనే వాదనలు వినిపిస్తున్నాయి. అంతే కాకుండా ఈరెండు నెలల్లో పాఠశాల విద్యార్థినిలకు ఆహారంగా పంపిణీ చేయాల్సిన బియ్యాన్ని పక్కదారి పట్టించినట్లు ఆరోపణలు ఉన్నాయి. సుమారు తొమ్మిది క్వింటాళ్ల బియ్యాన్ని పక్కదారి పట్టించారనే విషయం అధికారుల విచారణలో బయటపడినట్లు తెలుస్తోంది. తొమ్మిది క్వింటాళ్ల బియ్యాన్ని పిఎన్ బొడ్డువలస సాంఘిక సంక్షేమ ఆశ్రమ పాఠశాల నుంచి అప్పుగా తీసుకొచ్చినట్టు పాఠశాల నిర్వాహకులు అధికారుల విచారణలో చెప్పినట్లు సమాచారం. అయితే అధికారులు పక్క పాఠశాల నుంచి తొమ్మిది క్వింటాళ్ల బియ్యాన్ని అప్పు తేవడంపై విచారణ చేయగా అది అవాస్తవమని తేలింది. పాఠశాల నుంచి ఒక వ్యక్తి మూడు బస్తాల బియ్యాన్ని మోటార్ సైకిల్ పై తీసుకెళ్లిన విషయం కూడా అధికారుల దృష్టికి వెళ్లినట్లు తెలిసింది. ఈ పరిణామాల నేపథ్యంలో ఇంఛార్జి ఎస్ఒ షబ్నం బేగం రాజీనామా చేయడం చర్చనీయాంశమవుతోంది. పాఠశాల నుంచి బియ్యం మెక్కిన పందికొక్కులు ఎవరనేది అధికారుల విచారణలో బయటపడినప్పటికీ చర్యలు తీసుకోవడంలో జాప్యం చేయడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో మంత్రి సంధ్యారాణి తనిఖీ సందర్భంగా బయటపడిన లోపాలకు ఎవరు బాధ్యులో ఇప్పుడు జరిగిన పరిణామాలకు కూడా వారే బాధ్యులనే ప్రచారం జరుగుతోంది. ఎస్ఒ ప్రశాంతి సస్పెన్షన్ తర్వాత జరిగిన పరిణామాలతో విద్యార్థినులు కూడా తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నట్లు తెలుస్తోంది.

ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు రక్షణ కరువు

- ప్రహరీ లేక విష జంతువుల స్వైరవిహారం
- వేధిస్తున్న రక్తహీనత లోపం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

జిల్లాలోని పార్వతీపురం ఐటిడిఎ పరిధిలో గల గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు కనీస సౌకర్యాలు లేక రక్షణ కరువైంది. మన్యం జిల్లాలో పార్వతీపురం ఐటిడిఎ పరిధిలో 55 ఆశ్రమ పాఠశాలలు, సీతంపేట ఐటిడిఎ పరిధిలో 43 ఆశ్రమ పాఠశాలల్లో వేలాదిమంది విద్యార్థులు చదువుతున్నారు. కనీస సదుపాయాల్లేకపోవడంతో చదువు కోసం సుదూర ప్రాంతాల నుంచి వస్తున్న విద్యార్థులు నానా అవస్థలు పడాల్సి వస్తుంది. ప్రధానంగా ఆశ్రమ పాఠశాలలకు సరైన ప్రహరీలు లేవు. కొండల సమీపంలో ఉన్న ఆశ్రమ పాఠశాలల్లో రాత్రివేళ అప్పుడప్పుడు అడవి జంతువులు, విషసర్పాలు వస్తుండడంతో విద్యార్థులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. పలువురు విద్యార్థులు పాము కాటుకు గురైన సందర్భాలు కూడా ఉన్నాయి. విద్యార్థులకు సమయానికి భోజనం అందించే వంట కుక్‌ల కొరత సమస్య వెంటాడుతుంది. వందలాది మంది విద్యార్థులు ఉన్నచోట కేవలం ఒకరో ఇద్దరో కుక్‌లు ఉండడంతో విద్యార్థులకు సకాలంలో భోజనాలు అందించలేని పరిస్థితి. పలు వసతి గృహాల్లో సంరక్షకులే నియమించి నెల నెల జీతాలు ఇస్తున్న పరిస్థితి.

కానరాని ఆరోగ్యం

ఇటీవల కురుస్తున్న వర్షాలకు విద్యార్థులు వ్యాధులు బారిన పడుతున్నారు. విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలందక ప్రతి ఏటా మరణాలు సంభవిస్తున్నాయి. అయినా పాలక ప్రభుత్వాలు, ప్రజా ప్రతినిధులు నివారణ చర్యలు చేపట్టడంలో శ్రద్ధ వహించడం లేదు. ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు స్థానికంగా వైద్యమందించే ఆరోగ్య సిబ్బంది లేకపోవడంతో సకాలంలో వైద్యమందక విద్యార్థులు మరణిస్తున్నారని పలుమార్లు గిరిజన సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. విద్యార్థులకు పౌష్టికాహారం అందకపోవడంతో ఎక్కువ మందిలో రక్తహీనత కనిపిస్తుందని గిరిజన విద్యార్థి సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఏటా మన్యం జిల్లాలో వందలాది మంది విద్యార్థులు అనారోగ్యానికి గురై ఆస్పత్రుల్లో చేరడం పరిపాటిగా మారుతుంది. ఎంతో ఆసక్తితో చదువుకోడానికి వచ్చిన విద్యార్థులు అనారోగ్యానికి గురికావడంతో చదువుకు దూరమవుతున్నారు. వైద్య సిబ్బందిని నియమించాలని కొన్నేళ్లుగా కోరుతున్నా మంత్రి తొలి సంతకం నేటికీ అమలుకు నోచుకోలేదు. పలుచోట్ల నైట్ వాచ్మెన్ పోస్టులు కూడా లేని పరిస్థితి. పై సమస్యలపై పలు గిరిజన సంఘాలు, విద్యార్థి సంఘాల నాయకులు అధికారులు దృష్టికి తీసుకెళ్లినా, వివిధ రూపాల్లో ఆందోళనలు చేపట్టినా నేటికీ పరిష్కారం చూపలేదు. అధికారుల ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల పర్యవేక్షణ పూర్తిగా కొరవడింది. కొత్తగా వచ్చిన అధికారులైనా వీటిపై ప్రత్యేక దృష్టి సారించి, సమస్యల పరిష్కారానికి మార్గం చూపాలని, విద్యార్థులకు సరైన రక్షణ కల్పించాలని గిరిజన విద్యార్థి సంఘాల నాయకులు కోరుతున్నారు.

రక్షణ గోడలేని టిటుకుపాయి గిరిజన ఆశ్రమ పాఠశాల

ఉధృతంగా శాస్త్ర విజ్ఞాన ప్రచారం

- ఎఐపిఎస్ఎన్ ప్రధానకార్యదర్శి ఆషా మిశ్రా
- ప్రజాఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లాలి : రామచంద్రయ్య
- ఘనంగా ముగిసిన జెవివి రాష్ట్ర మహాసభ

ఎన్నికైన జెవివి రాష్ట్ర నూతన కార్యవర్గం

మాట్లాడుతున్న ఎఐపిఎస్ఎన్ ప్రధానకార్యదర్శి ఆషా మిశ్రా

ప్రజాశక్తి-విజయనగరంటౌన్, కంటోన్మెంట్

సామాజిక, రాజకీయ, ఆర్థిక సాంస్కృతిక పరిణామాల నేపథ్యంలో శాస్త్ర విజ్ఞానం ప్రచారాన్ని మరింతగా ముందుకు తీసుకెళ్లాలని ఆల్ ఇండియా పీపుల్స్ సైన్స్ నెట్వర్క్ జనరల్ సెక్రెటరీ ఆషా మిశ్రా అన్నారు. నగరంలోని గురజాడ అప్పారావు ప్రాంగణం (జిల్లా పరిషత్ కార్యాలయం ప్రాంగణం)లో జెవివి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గేయానంద్ అధ్యక్షతన రెండు రోజులు పాటు అత్యంత ఉత్సాహ పూరిత వాతావరణంలో జరిగిన రాష్ట్ర 18వ మహాసభలు ఆదివారం సాయంత్రం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా మహాసభ చేసిన పది తీర్మానాలను ప్రతినిధులంతా ఏకగ్రీవంగా ఆమోదించారు. శాస్త్ర విజ్ఞాన ప్రచారాన్ని మరింత ఉధృతంగా సాగించాలని ప్రతినపూనారు. జెవివి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుర్రా రామారావు ప్రవేశపెట్టిన నివేదికను సభ్యులంతా ఆమోదించారు. పర్యావరణ పరిరక్షణ అనే అంశంపై మాజీఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ ప్రసంగించారు. మహాసభకు ముఖ్యఅతిథిగా హాజరైన ఆషామిశ్రా ప్రతినిధులను ఉద్దేశించి మాట్లాడారు. ఎఐపిఎస్ఎన్ ఆశించిన దాని కంటే జెవివి మరింత కషి చేస్తుందన్నారు యువజన, మహిళా కార్యకర్తలు చురుగ్గా పనిచేస్తున్నారని అభినందించారు. సైన్సుపై దాడి జరుగుతున్న నేపథ్యంలో మన కార్యక్రమాలకు మరింత ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. చెకుముకి ఎడిటర్, జెవివి ఉమ్మడి రాష్ట్ర పూర్వ అధ్యక్షులు ఎ.రామచంద్రయ్య మాట్లాడుతూ డిజిటల్ మీడియా ద్వారా కుహనా సైన్స్ ముందుకు వేగంగా సాగుతుందన్నారు. దీన్ని అరికట్టాల్సిన అవసరం ఉందన్నారు. డిజిటల్ మీడియా ద్వారా మన వాయిస్‌ను పెంచాల్సిన అవసరం ఉందన్నారు ఐదేళ్లకొకసారి రెండు రాష్ట్రాల జనవిజ్ఞాన వేదికలు సమావేశం నిర్వహించి విషయాలను షేర్ చేసుకొని ప్రజా ఉద్యమాన్ని ముందుకు తీసుకువెళ్లాలని సూచించారు.

మహిళా యువతకు సైన్సును అందించడమే లక్ష్యం

మహిళలకు సైన్సు అందించడమే ధ్యేయంగా జెవివి సమతా విభాగం పనిచేస్తుందని సమత రాష్ట్ర నాయకులు తెలిపారు. మహాసభలో పలు జిల్లాలకు చెందిన సమతా సభ్యులు ఆయా జిల్లాల్లో చేస్తున్న కార్యక్రమాలను, విద్యాసంస్థల్లో చేస్తున్న ప్రచారాలను వివరించారు. యువత సన్మార్గంలో నడిచే విధంగా అవగాహన సదస్సులు నిర్వహించినట్లు తెలిపారు. సభలో జెవివి జిల్లా నాయకులు వి.రాజగోపాల్ మాట్లాడారు. మహాసభలో జెవివి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎంవిఎన్ వెంకటరావు, రమణ ప్రభాత్, నాయకులు చీకటి దివాకర్, వి.రాజగోపాల్, సమత విభాగం రాష్ట్ర కన్వీనర్ జి.నిర్మల, రాష్ట్రనాయకులు, మహాసభకు వచ్చిన ప్రతినిధులు, విద్యావేత్తలు, మేధావులు, కవులు, కళాకారులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సైన్స్ వాక్

మహాకవి గురజాడ అప్పారావు నివాసాన్ని సాంస్కృతిక కేంద్రంగా తీర్చిదిద్దాలని, ఆయన పేరు మీద గురజాడ సాంస్కృతిక విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుర్రా రామారావు, మాజీ ఎమ్మెల్సీ కె ఎస్ లక్ష్మణరావు డిమాండ్ చేశారు. జెవివి రాష్ట్ర మహాసభల్లో భాగంగా స్థానిక మయూరి హోటల్ ప్రాంతం నుంచి ట్యాంక్ బండ్, బాలాజీ జంక్షన్, కోట జంక్షన్, గురజాడ అప్పారావు నివాసం మీదుగా గురజాడ విగ్రహం, సంగీత కళాశాల వరకు వందలాది మంది సైన్స్ వాక్ నిర్వహించారు. వాక్‌ను జెవివి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గేయానంద్, మాజీ ఎమ్మెల్సీ కె ఎస్ లక్ష్మణరావు జెండాఊపి ప్రారంభించారు. వాక్‌లో పాల్గొన్న వారంతా పలు నినాదాలు చేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. కార్యక్రమంలో భాగంగా గురజాడ నివాసాన్ని, సంగీత కళాశాలను ప్రతినిధులంతా సందర్శించారు. ఎంఆర్ కళాశాల సమీపాన గురజాడ అప్పారావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కళాకారులు గురజాడ గేయాలను ఆలపించారు. ఈ సందర్భంగా జెవివి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామారావు, మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ గురజాడ అంటే తెలుగువారు గర్వంగా చెప్పుకునే దేశభక్తుడు అని అన్నారు. ఆయన నివాసాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకొని పరిరక్షించి, సాంస్కృతిక కేంద్రంగా తీర్చిదిద్దాలని డిమాండ్ చేశారు. ఆయన పేరు మీద గురజాడ సాంస్కృతిక విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సైన్స్ వాక్‌లో అనంతపురం జిల్లాకు చెందిన ఎ.ప్రసాద్ కళ్లకు గంతలు కట్టుకొని వాక్ ముందు భాగంలో బైక్‌ను నడిపారు. అదే విధంగా అగ్నితో కాలుతున్న కర్రను వంటికి రాసుకుని సైన్స్ ప్రదర్శన చేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామారావు పిల్లి మొగ్గలు వేస్తూ అలరించారు. కార్యక్రమంలో జెవివి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎంవిఎన్ వెంకటరావు, రమణ ప్రభాత్, నాయకులు చీకటి దివాకర్, రాజ్ గోపాల్, సమత విభాగం రాష్ట్ర కన్వీనర్ జి.నిర్మల, జెవివి రాష్ట్రనాయకులు, మహాసభకు వచ్చిన ప్రతినిధులు, విద్యావేత్తలు, మేధావులు, కళాకారులు పాల్గొన్నారు.

లౌకిక రాజ్యాంగాన్ని కాపాడుకోవడం మన కర్తవ్యం

నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు

రాష్ట్ర కమిటీ ఎన్నిక అనంతరం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కెఎస్ లక్ష్మణరావు, టి.సురేష్ మాట్లాడారు. నేడు జెవివి అవసరం దేశానికి, ప్రజలకు ఎంతో అవసరమన్నారు. లౌకిక రాజ్యాంగాన్ని రక్షించుకోవాల్సిన అవసరం మనందరిపైనా ఉందన్నారు. రానున్న కాలాన్ని ఛాలెంజ్‌గా తీసుకొని జెవివిని మరింత అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. మహాసభ మన ముందు చాలా కర్తవ్యాలను ఉంచిందని, వాటిని అమలు చేసేందుకు రానున్న కాలంలో కృషి చేస్తామని తెలిపారు.

75 మందితో జెవివి రాష్ట్ర నూతన కమిటీ ఎన్నిక

మహాసభలు సందర్భంగా జెవివి రాష్ట్ర నూతన కమిటీ 75మందితో ఏకగ్రీవంగా ఎన్నికైంది. రాష్ట్ర అధ్యక్షులుగా కెఎస్ లక్ష్మణరావు, ప్రధాన కార్యదర్శిగా టి.సురేష్, కోశాధికారిగా జి.మురళీధర్, ఎన్నికయ్యారు. వీరితో పాటు కార్యదర్శులుగా డాక్టర్ ఆదిశేషు, జిహెచ్ఎస్‌పి వర్మ, స్వరూపరెడ్డి, వైఎఆర్‌కె ప్రసాద్, శివరాం, బి.రవికుమార్, ఉపాధ్యక్షులుగా కె.శ్రీనివాస్, డాక్టర్ కాలేషా, వైఎస్ నాగేశ్వరరావు, సిహెచ్ జయప్రకాష్, మాణిక్యం శెట్టి, రెడ్డప్ప ఎన్నికయ్యారు. జెవివి సబ్ కమిటీ కన్వీనర్లుగా జి.నిర్మల (సమత), జి.గిరిధర్ (విద్య), కెఎంఎం (చెకుముకి), ఎంవి చలపతి (శాస్త్ర విజ్ఞానం), జి.మహేష్ (యువత), డి.బుజ్జిబాబు (పబ్లికేషన్) ఎన్నికయ్యారు. 54మంది రాష్ట్ర కమిటీ సభ్యులతో నూతన రాష్ట్ర కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది.

సిఎం సహాయనిధి చెక్కు అందజేత

ప్రజాశక్తి -పార్వతీపురం

సీతానగరం మండలం కె.వెంకటాపురం గ్రామానికి చెందిన బుడితి శంకర్రావు కుటుంబ సభ్యులకు రూ.95,837 చెక్కును ఎమ్మెల్యే బి.విజయ్‌చంద్ర అందజేశారు. ఆదివారం స్థానిక టిడిపి కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలకు ఆరోగ్య సమస్యలు ఎదురైతే వైద్యం చేయించుకోలేని పరిస్థితి ఉన్న వాళ్లకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని, అందులో భాగంగానే సిఎం సహాయ నిధి కింద సాయం అందజేస్తున్నట్టు తెలిపారు. లబ్ధిదారుడు మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతూ ఎంతో ఖర్చుతో కూడిన చికిత్స చేయించుకోవటం కోసం ఎమ్మెల్యే సహాయం కోసం అడిగితే అడిగిన వెంటనే సిఎం సహాయ నిధి ద్వారా తమకు ఆర్థిక సహాయం అందజేశారని కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండల టిడిపి కార్యదర్శి, ఎఎంసి వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్ నాయుడు, మాజీ సర్పంచ్ బి.గోపాలకృష్ణ, పాపంవలస కో-ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షులు బి. మోహన్‌రావు, పెద బోగిలి సర్పంచ్ జొన్నాడ తేరేజమ్మ, గరికయ్యతో పాటు మండల నాయకులు పాల్గొన్నారు.

జాతీయ సదస్సుకు ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

తిరుపతిలో ఆదివారం నిర్వహించిన రాష్ట్ర, కేంద్ర పాలిత ప్రాంతాల చట్టసభల మహిళా సాధికార కమిటీల జాతీయ సదస్సుకు కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి హాజరయ్యారు. ఆమెతో పాటు ఉమ్మడి జిల్లాలకు చెందిన మహిళా ఎమ్మెల్యేలు, మన్యం జిల్లాకు చెందిన మంత్రి సంధ్యారాణి కూడా ఉన్నారు.

16న స్త్రీ శక్తి ర్యాలీ

ప్రజాశక్తి - సీతానగరం

ఈనెల 16న పార్వతీపురంలో స్త్రీ శక్తి ర్యాలీ నిర్వహిస్తున్నట్లు మండల టిడిపి అధ్యక్ష కార్యదర్శులు పి.సత్యంనాయుడు, ఆర్.వేణుగోపాల్ నాయుడు ఆదివారం తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రతి గ్రామం నుంచి 50 మంది మహిళలు చొప్పున ప్రతి కార్యకర్త 35 పంచాయతీల నుంచి తీసుకువచ్చి జయప్రదం చేయాలని కోరారు. స్త్రీ శక్తి కార్యక్రమంలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, డ్వాక్రా మహిళలకు వడ్డీ లేని రుణాలు వంటి కార్యక్రమాలు అమలును కూటమి ప్రభుత్వం చేపట్టిందన్నారు. ఈ మేరకు మంగళవారం ర్యాలీ నిర్వహించనున్నట్టు తెలిపారు.

డాక్టర్ రవికి కేంద్రమంత్రి సన్మానం

ప్రజాశక్తి - పార్వతీపురం

శ్రీకాకుళం ట్రిబుల్ ఐటి డీన్, స్టూడెంట్స్ వెల్ఫేర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ గేదెల రవి పిహెచ్‌డి పట్టా అందుకున్న సందర్భంలో ఆదివారం శ్రీకాకుళం జిల్లాలో జరిగిన ఎర్రన్న విద్య సంకల్పం కార్యక్రమంలో సైన్స్ అండ్ టెక్నాలజీ ఫ్యాకల్టీగా సేవలందించిన సందర్భంగా కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, శ్రీకాకుళం ఎమ్మెల్యే గుండు శంకర్, ఎమ్మెల్సీ డాక్టర్ వేపాడ చిరంజీవి రావు అభినందనలు తెలిపారు. ఇంకా మరెన్నో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు.

ఘనంగా గాడిచర్ల జయంతి

ప్రజాశక్తి - పాలకొండ

ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, గ్రంథాలయ ఉద్యమకారుడు గాడిచర్ల హరిసర్వోత్తమరావు జయంతి వేడుకలు స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. తొలిత గాడిచర్ల హరి సర్వోత్తమరావు చిత్రపటానికి ఉత్తరాంధ్ర ఎస్సీ , ఎస్టీ ఉద్యోగుల ఐక్య వేదిక సంఘం కన్వీనర్ నూతలపాటి భరత్ భూషణ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాడిచర్ల హరిసర్వోత్తమరావు 1883 సెప్టెంబర్ 14న జన్మించారని, స్వాతంత్ర సమరయోధునిగా ఉంటూ గ్రంథాలయ ఉద్యమానికి ఎంతో కృషి చేశారని అన్నారు. ఆయన గురించి ప్రతి విద్యార్థి తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో 13వ వార్డు కౌన్సిలర్ బాసూరు కాంతారావు, వార్డు అడ్మిన్ శివ, కె.షణ్ముఖ రావు, దుర్గారావు, సింహాచలం, మధుసూదనరావు, మహేష్, డి.శ్యామలరావు, ఇన్‌ఛార్జి గ్రంథాలయ అధికారి బబ్బురు గణేష్ బాబు, గ్రంథాలయ సహాయకుడు ఈశ్వర్, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భాస్కరభట్లను సత్కరిస్తున్న నరహరి శాస్త్రి, తదితరులు

భాస్కరభట్లకు సన్మానం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణ శివారులో ఉన్న శ్రీసూర్య పీఠంలో ఆదివారం ఆశేష శేముషి నిధి బ్రహ్మశ్రీ వేమకోటి నరహరి శాస్త్రి ఆధ్వర్యంలో బాను సప్తమి పూజలు, హోమాలు, సూర్య నమస్కారాలు నిర్వహించారు. అనంతరం మధుర గాయక, జాతీయ స్థాయి ఉత్తమ గాయకులచేత ఎన్నో సత్కారాలు పొందిన శ్రీ సూర్యపీఠ ఆస్థాన పండిత గాయకులు భాస్కరభట్ల సత్యప్రసాద్ శర్మకి దుశ్శాలువతో సౌరయాగశాలలో సత్కరించారు. అనంతరం సూర్యభగవానుని ప్రతిమ, కళ్యాణ శేషవస్త్రం, లక్ష్మీనారాయణ యంత్రాన్ని అశేషశేముషీనిధి బ్రహ్మశ్రీ వేమకోటి నరహరిశాస్త్రి బహూకరించారు. ఈ కార్యక్రమంలో వే.వివేకానంద శర్మ, వే.నీలకంఠ శర్మ, వే.బదరీశర్మ, దా.ఉమా శర్మ, కేశవ శర్మ, హర్ష శర్మ, దివాకర శర్మ, టి.ఆర్.కె.శర్మ తదితరులు వైదిక సహకారం అందించారు. అనంతరం బాల భాస్కర ఋషివాటికలో నారాయణ సేవ నిర్వహించారు.

గ్రామాల్లో వారాల పండగ

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని బుడ్డిపేట, సీతానగరం, ఆర్ అంకంపేట, కాజీపేట, అందిపేట తదితర గ్రామాలలో ఆదివారం దేశం తల్లి, బోగితల్లి వారాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామ పెద్దలు ఎస్.వెంకటరమణ, బి.రామారావు, పెద్ద ఎత్తున యాత్రికలు పాల్గొన్నారు.

నేడు వాహనాల వేలం

ప్రజాశక్తి- సాలూరు రూరల్

స్థానిక పట్టణ పోలీసు స్టేషన్‌లో సోమవారం గతంలో పట్టుబడిన వాహనాలను వేలం వేస్తామని పట్టణ సిఐ బి.అప్పల నాయుడు అన్నారు. వివిధ కేసులలో పట్టుబడిన నాలుగు ద్విచక్ర వాహనాలు, రెండు ఫోర్ వీలర్స్‌ను పోలీస్ స్టేషన్ ఆవరణలో బహిరంగ వేలం వేస్తామన్నారు. ఆసక్తి గల వారందరూ ఈ బహిరంగ వేలంలో పాల్గొనవచ్చునన్నారు.

బాధితులను పరామర్శిస్తున్న పుష్పశ్రీవాణి

పలువురికి పుష్పశ్రీవాణి పరామర్శ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

జియ్యమ్మవలస మండలంలోని ఇటీవల పలు కారణాలతో మృతి చెందిన వారి కుటుంబాలను మాజీ డిప్యూటీ సిఎం పాముల పుష్ప శ్రీవాణి ఆదివారం పరామర్శించారు. పెదమేరంగ్ణో వి.గోవిందరావు, ఇటుకలో కురిమి నాయుడు కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో మండల కన్వీనర్, ఎంపిటిసిలు సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి యువకుడు మృతి

సీతానగరం : బొబ్బిలి మండలం శివడవలసకు చెందిన వందరాపు రాము (33) పురుగుల మందు తాగి మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి. మేరకు రాము తన భార్యతో ఉన్న గొడవల కారణంగానా ఆమె కాపురానికి రావడం లేదు. దీంతో మనస్తాపానికి గురై పురుగుల మందు అత్త వారిస్వగ్రామైన సీతానగరం మండలం లక్ష్మీపురం గ్రామానికి మధ్యాహ్నం 12 గంటల సమయంలో వచ్చాడు. అపస్మారక స్థితిలో ఉన్న అతడ్ని బంధువులు ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. సీతానగరం ఎస్ఐ రాజేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శిక్షణ ఇచ్చారు.. కొలువు మరిచారు

◆ అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న ఎస్ఎల్ఆర్ఎం సిబ్బంది ◆మూడు నెలలు గడుస్తున్నా ఉద్యోగం లేక అవస్థలు

ప్రజాశక్తి- సీతంపేట

పట్టణాలకు పల్లెలే పట్టుకొమ్మలని మన పెద్దలు చెబుతుంటారు. పల్లెలు బాగుంటే పట్టణాలు బాగుంటాయని అంటారు. ఇందులో భాగంగా గ్రామాలు, పట్టణాలు పరిశుభ్రంగా ఉంచాలని రాష్ట్ర ప్రభుత్వం శుభ్రత పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించింది. రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ద్వారా ప్రతి పంచాయతీ నుంచి ఒకరు లేక ఇద్దరు వాలంటీర్లను ఇటీవల కాలంలో ఎంపిక చేశారు. వారిని ఎంపిక చేసి మూడు నెలలు గడుస్తున్నా కొలువు లేదు. దీంతో ఉద్యోగం లేక నానా అవస్థలు పడుతున్నారు.

జిల్లాలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా మార్చి నెలలో మూడు నెలల పాటు వాలంటీర్లను ఎంపిక చేసి శిక్షణ ఇచ్చారు. ఎస్ఎల్ఆర్ఎం సాలిడ్ లిక్విడ్ రిసోర్స్ మేనేజ్మెంట్ స్వచ్ఛంద కార్పొరేషన్ ద్వారా మండలంలో ప్రతి పంచాయతీకి ఒకరు లేక ఇద్దరు చొప్పున ఇంటర్, డిగ్రీ అర్హత ఉన్న వారిని గుర్తించి ఎంపిక చేశారు. వీరిలో ప్రాజెక్ట్ హెడ్‌కు రూ.15వేలు, ప్రాజెక్ట్ ఇంచార్జ్‌కు రూ.12వేలు, యూనిట్ ఇంచార్జ్‌కు రూ.10,500, వాలంటీర్లుకు, కన్వీనర్ పోస్టులకు కూడా జీతం ఫిక్స్ చేశారు. క్యాడర్ వారీగా ఎంపిక చేశారు. వీరికి పార్వతీపరంలో ఎంపిడిఒలు, జట్టు ఆశ్రమం, ఎన్‌జిఒ ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. పార్వతీపురం మన్యం జిల్లాలోని పైలెట్ ప్రాజెక్టుగా దీన్ని తీసుకున్నా ఫలితం మాత్రం రాలేదు. శిక్షణ ఇచ్చిన వారికి ఇప్పటి వరకూ ఉద్యోగాలు ఇవ్వలేదు.

పక్క మండలాల్లో ఏ విధంగా ఉందో తెలుసుకోండి

మీకు ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం మీ ఎస్ఎల్ఆర్ఎం హెడ్‌ను కనుక్కోండి. లేదంటే పక్క మండలంలో ఏ విధంగా తీసుకున్నారో కనుక్కొని దాని ప్రకారం ఉత్తర్వులు ఉంటే దాని ప్రకారం చేద్దాం.

బిబి మిశ్రా, ఎంపిడిఒ, సీతంపేట

శిక్షణ అనంతరం ధ్రువ పత్రాన్ని అందిస్తున్న కలెక్టర్ (ఫైల్)

వాలంటీర్లకు న్యాయం చేయాలి

స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా సాలిడ్ అండ్ లిక్విడ్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్రాజెక్ట్‌ను జిల్లా కలెక్టర్ చొరవతో పార్వతీపురం మన్యం జిల్లాలో ఒక పైలెట్ ప్రాజెక్టుగా తీసుకొచ్చారు. పార్వతీపురం మన్యం జిల్లా సొసైటీ, జట్టు ట్రస్ట్ ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్‌కి స్టేట్ అడ్వైజర్‌గా ఉన్న వెల్ఫూర్ శ్రీనివాసన్ వాలంటీర్లకి మాస్టర్ ట్రైనర్స్ ద్వారా ట్రైనింగ్ ఇప్పించారు. మూడు నెలల శిక్షణ కాలానికి గాను రెండు నెలలు మాత్రమే శిక్షణ ఇచ్చి వదిలేశారు. జిల్లా మొత్తం 136 మంది వాలంటీర్లు ఉండగా ఒక్క సీతంపేట మండలంలోనే 51 మంది నిరాశతో ఆశగా ఉద్యోగం వస్తోందని ఎదురుచూస్తున్నారు. దీనికి ప్రభుత్వం సరైన న్యాయం చేయాలని కోరుతున్నాం.

యం. నరేష్, మండల లీడింగ్ వాలంటీర్, సీతంపేట

మా ఉద్యోగం మాకు కల్పించాలి

చెత్త నుంచి సంపద ఎలా సృష్టించగలం అనే కాన్సెప్ట్‌తో ప్రభుత్వం మాకు ఉచితంగా ట్రైనింగ్ ఇచ్చింది. నేను ట్రైనింగ్ టైమ్‌లో టీమ్ అందరికీ టీమ్ లీడర్‌గా బాధ్యతలు చేప ట్టాను. పార్వతీపురం మన్యం జిల్లాకు మొదట ప్రాధాన్యతగా ట్రైనింగ్ ఇచ్చారు. శిక్షణ పూర్తయిన తరువాత గ్రామ పంచాయతీలో తీసుకుంటాం అని చెప్పారు. మేము ట్రైనింగ్ థియరీ, ప్రాక్టికల్ చేసి సర్వే కూడా చేసి ఉన్నాం. తర్వాత మాకు ట్రావెలింగ్ చార్జెస్ కూడా ఇస్తామన్నారు. అవి కూడా ఇవ్వలేదు. 3 నెలలు అయిపోయాక మాకు ఎటువంటి సమాచారం ఇవ్వలేదు. పైగా మమ్మల్ని పట్టించుకోవడం మానేశారు. దీని మీద జిల్లా, మండల ప్రభుత్వ అధికారులు స్పందించి ట్రైనింగ్ పూర్తి చేసిన ట్రైనర్స్‌ని జాబ్‌లోకి తీసుకోవాలనీ కోరుకుంటున్నాం.

- ఎన్. గణేష్, ఎస్ఎల్ఆర్ఎం ట్రైనింగ్ లీడర్

వీరు ఏం చేయాలంటే?

స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా ఎంపికైతే వీరు చెత్త నుంచి సంపద సృష్టించే కేంద్రాలు వద్ద ప్రాసెసింగ్ చేయడం, రీసైకిలింగ్ చేయించడం, తడి చెత్త, పొడి చెత్త, వేరు చేయించడం, ఎస్‌డబ్ల్యూ పిసికి ఆదాయాలు చేకూర్చడం, ప్రజలకు అవగాహన కల్పించడం, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడం వంటి కార్యక్రమాలు చేపట్టాలి. వీటిపై శిక్షణ ఇచ్చి నెలలు గడుస్తున్నా విధులు మాత్రం అప్పగించలేదు. దీంతో వీరంతా అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఉద్యోగం ఇవ్వక, జీతం లేక నానా అవస్థలు పడుతున్నారు. ఇప్పటికే ఈ విషయంపై కలెక్టర్‌ను కూడా కలిశారు. ఎంపిడిఒకు కూడా వినతి ఇచ్చినా ఫలితం లేదని ఆందోళన చెందుతున్నారు.

బహుళ అంతర పంటలతో మేలు

ప్రజాశక్తి - పాచిపెంట

రైతులు కేవలం ఏకపంట విధానాన్ని పాటించడం కంటే బహుళ పంటల విధానం లేదా అంతర్ పంటల విధానాన్ని అవలంభించడం ద్వారా అదనపు ఆదాయాన్ని పొందవచ్చని మండల వ్యవసాయధికారి కె.తిరుపతిరావు అన్నారు. మండలంలోని పాంచాలిలో వరి గట్ల మీద కంది విత్తనాలను నాటిస్తూ పత్తిలో అంతర పంటగా వేసిన కందిని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంతర్ పంటల విధానంతో కేవలం అదనపు ఆదాయం రావడమే కాకుండా భూమి బయట లోపల జీవ వైవిధ్యం పెరిగి భూమి భౌతిక స్థితి మెరుగుపడి పంటకు కావాల్సిన అన్ని పోషకాలు అందుతాయని అన్నారు. బహుళ పంటల వేరు బుడిపెలులో ఉన్న సూక్ష్మజీవులు గాలిలో ఉన్న నత్రజని భూమిలోకి స్థిరీకరించి పంటకు అందేలా చేస్తుందని వివరించారు. అలాగే వరి గట్ల మీద కంది విత్తనాలు నాటుకోవడం ద్వారా ఎకరా వరిగట్ల మీద నుంచి కనీసం 100 కిలోల వరకు కంది పంటను పొందవచ్చని తెలిపారు. దీనికి ఎలాంటి ఖర్చు లేదని ప్రభుత్వం ఉచితంగా ఇస్తున్న కందిని నాటుకుంటే సరిపోతుందని తెలిపారు. గట్ల మీద కంది విత్తనాలు నాటడం ద్వారా వేరు వ్యవస్థ భూములోనికి వెళ్లడం వల్ల గట్లు కూడా స్థిరంగా ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో విఎఎ మోహన్ కృష్ణ, ప్రకృతి సేద్య ఉద్యోగులు పాల్గొన్నారు.

అంతర్ పంటలు గురించి వివరిస్తున్న ఎఒ

వినియోగంలోకి తెచ్చేనా?

ప్రజాశక్తి -కొమరాడ

లక్షలాది రూపాయలు విలువ చేసే ప్రభుత్వ భవనాలను అధికారులు నిరుపయోగంగా ఉంచుకుంటున్నారు. కొమరాడ సమీపాన గల ఉన్న గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల కేంద్ర భవనానికి మరమ్మతులకు నిధులు కేటాయించకపోవడంతో కోట్లాది రూపాయలు విలువ చేసే ఈ భవనం శిథిలావస్థకు చేరే పరిస్థితి ఉంది. గతంలో ఈ ఆశ్రమ పాఠశాల శిథిలావస్థలపై కలెక్టర్ కార్యాలయంలో గ్రీవెన్స్‌లో సిపిఎం నాయకులు ఇచ్చిన ఫిర్యాదు నేపథ్యంలో అధికారులు వచ్చారు... చూశారు తప్ప ఈ సమస్య పరిష్కారానికి ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ఈ భవనానికి పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపడితే అటు గిరిజన బాలికల కోసం, కాలేజీల్లో చదువుతున్న విద్యార్థుల హాస్టల్ కోసం ఉపయోగపడే పరిస్థితి ఉంది. దని అన్నారు.

మరమ్మతులకు గురైన భవనం

కొమరాడ మండల కేంద్రంలో ఎన్నో ఏళ్ల క్రితం నిర్మించిన గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల శిథిలావస్థ చేరడంతో కొత్త భవనం కోసం నాలుగు కోట్లతో ప్రారంభించిన పనులు పునాదికే పరిమితమయ్యాయి. ఈ విషయం ఉన్నతాధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోకపోవడం దారుణం. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ భవనానికి మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తేవాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు.

అడుగుకో గుంత.. నిత్యం చింత

ప్రజాశక్తి - సాలూరురూరల్

గ్రామీణ ప్రాంతాల్లో ప్రధాన సమస్యల్లో రహదారుల సమస్య అతి పెద్దది. ఇందులో మండలంలోని నెలిపర్తి పంచాయతీ దుగ్గ సాగరం గ్రామానికి చెందిన రహదారి ఒకటి. ఈ గ్రామం నుంచి ప్రతి రోజూ చదువు, కిరాణా కోసం, వైద్యం కోసం సాలూరు పట్టణానికి రావాలి. ఈ రోడ్డు నిర్మాణం జరిగి కనీసం 15 ఏళ్ల అవుతుంది. దీన్ని ఇలాగే వదిలేయడం ఎక్కడికక్కడ గుంతలు పడుతున్నా ఏ రాజకీయ నాయకుడు, అధికారులు పట్టించుకోవడంలేదు. దీంతో ఈ రోడ్డు వర్షం పడితే చెరువులా తయారై ఎక్కడ పడితే అక్కడ గుంతల తయారవ్వడంతో ప్రయాణికులకు నానా ఇబ్బందులు పడుతున్నారు. అనేక సార్లు ఈ రోడ్డు గుంతల్లో పడి చాలామందికి కాలు, చేయి విరిగిన సందర్భాలు కూడా ఉన్నాయి. సాయంత్రం పూటైతే సాలూరు పట్టణానికి వెళ్లడానికి ఈ ఊరు నుండి వెళ్లాలన్న, రావాలన్నా అవకాశంలేదు. వైద్యం కోసం అత్యవసర సమయంలో గ్రామానికి అంబులెన్స్ రావడానికి కూడా ఇబ్బందులు పడుతున్న పరిస్థితి. ఇదే విషయమే స్థానిక ప్రజాప్రతినిధులకు, సంబంధిత అధికారులకు పలుమార్లు విన్నవించుకున్నా కనీసం పట్టించుకోకపోవడం చాలా దారుణమని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు తక్షణమే స్పందించి తమ గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గోతులమయమైన రోడ్డు

బాబోయ్ కుక్కలు

భయాందోళనలో ప్రజలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలో ఏ గ్రామంలో చూసిన వీధి కుక్కల స్వైర విహారం కనిపిస్తున్నాయి. జిల్లాలో ఒకవైపు అడవి ఏనుగులు సంచారం ఉంటే... మరోవైపు ఇటీవల కాలంలో కుక్కల బెడద ఎక్కువైంది. వీధుల్లో పది నుంచి 20 కుక్కలు గుంపుగా తిరుగుతున్నాయి. దీంతో ఎటు నుంచి వచ్చి ఏ కుక్క వచ్చి కాటు వేస్తుందోనని ప్రజలు ఇంటి నుంచి బయటకు రావాలంటేనే భయపడుతున్నారు. ఇటీవల పార్వతీపురం పట్టణం కొత్తవలసలో ఊర కుక్కల బారిన పడి బాలుడు మృతి చెందాడు. గతంలో కూడా జియమ్మ మండలంలో బహిర్భూమికి వెళ్లిన వారిపై కుక్కల దాడిలో ముగ్గురు మృతి చెందారు. గుమ్మలక్ష్మీపురం, జియమ్మవలస మండలాల్లో కుక్కలు పలువుర్ని గాయపర్చిన సంఘటనలు అనేకం ఉన్నాయి. గుంపులుగా తిరుగుతున్న కుక్కలతో ప్రజలు ఇంటి నుంచి ఒకరు సాయంతో మరొకరు బయట మార్కెట్ కు వస్తున్నారు. కుక్కల భయంతో తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలకు బైక్‌లపై తీసుకువెళ్లి తీసుకొస్తున్నారు. వీధి కుక్కల భయం ఏ రీతిలో ఉందో ఇట్టే అర్థమవుతుంది. కుక్క కాటు నుంచి రాబిస్ వ్యాధి రాకుండా మందులు అందుబాటులో ఉంచాలని, కుక్కలను నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు.

గుంపుగా తిరుగుతున్న కుక్కలు

సూపర్ సిక్స్.. సూపర్ ఫ్లాప్ : కాంగ్రెస్

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

టిడిపి, జనసేన, బిజెపి కలయికతో ఏర్పడిన కూటమి ప్రభుత్వం 15 నెలల పాలనలో సూపర్ సిక్స్ సూపర్ ఫ్లాప్ అయ్యిందని కురుపాం నియోజకవర్గ కాంగ్రెస్ కోఆర్డినేటర్ అడ్డాకుల చిన్నారావు విమర్శించారు. గుమ్మలక్ష్మీపురంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. అనంతపురంలో విజయోత్సవ వేడుకలు నిర్వహించడంపై ఆయన మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వచ్చిన 15 నెలల్లో రాష్ట్రానికి, ప్రజలకు ఒరగబెట్టిందేమిటని ప్రశ్నించారు. సిఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ల కాంబినేషన్‌లో రాష్ట్రానికి ఒనగూడే ప్రయోజనాలను, విభజన, విశాఖ ఉక్కు పరిరక్షణ వంటి హామీలను పక్కన పెట్టి స్వప్రయోజనాల కోసం వెంపర్లలాడుతూ మోడీ అనే గాలం వాని చేతిలో చిక్కి ప్రజలకు ఉద్ధరిస్తున్నట్టు ఊకదంపుడు ప్రదర్శనలతో రక్తి కట్టిస్తున్నారని ఎద్దేవా చేశారు. సూపర్ సిక్స్ హామీలను నిబద్ధతతో అమలు చేయడంలో తడబడుతూ ఎన్నికల వేళ ఉపాధ్యాయ, ఉద్యోగుల, రైతులకు, నిరుద్యోగులైన యువతకు, మహిళలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో మేక పోతు గాంభీర్యాన్ని తలపింపజేస్తూ వేడుకలను నిర్వహించుకోవడం వెనుక ఆంధ్రులను అంధులను, బధిరులను చేయడమేనని విరుచుకుపడ్డారు.

నిలిచిన పాఠశాల భవనాల నిర్మాణం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని కంబరవలస, బిటివాడ, రేగుల పాడు కేజీబీవీ, నడిమికల్ల తదితర గ్రామాల్లో అదనపు పాఠశాల భవనాలు పనులు అర్ధాంతరంగా నిలిచిపోవడంతో విద్యార్థులకు అవస్థలు తప్పడం లేదు. ప్రస్తుతం ఉన్న భవనాలు సరిపోకపోవడంతో విద్యార్థులు ఇరుకైన గదులలోనే విద్యని కొనసాగించాల్సి వస్తుంది. గత ప్రభుత్వంలోనే నాడు-నేడు పథకం కింద లక్షలాది రూపాయలు వెచ్చించి అదనపు భవన నిర్మాణ పనులు చేపట్టినప్పటికీ అధికారుల అలసత్వం వల్ల కాంట్రాక్టర్‌కు సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో పనులను అర్ధాంతరంగా నిలిపివేశారు. దీంతో విద్యార్థులకు శాపంగా మారింది. ఇప్పటికైనా ఉన్నత స్థాయి అధికారులు స్పందించి అర్ధాంతరంగా నిలిచిపోయిన భవన నిర్మాణ పనులు పూర్తిచేసేందుకు తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నిర్మాణం మధ్యలో నిలిచిపోయిన కంబరవలస పాఠశాల భవనం

జోరుగా గుట్కా దందా

ప్రజాశక్తి - సాలూరురూరల్

జిల్లాలో గుట్కా వ్యాపారం యథేచ్ఛగా సాగుతున్నా అధికారులు మాత్రం ఏమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. జిల్లాలో మారుమూల గ్రామం నుంచి పట్టణంలోని ఎక్కడ ఏ చిన్న కిరాణా షాపులో చూసినా గుట్కాలు, ఖైనీలు విచ్చలవిడిగా అమ్మకాలు సాగుతున్నాయి. వ్యాపారులు షాపుల్లో వీటి తోరణాలుగా వేలాడదీస్తూ బహిరంగంగా విక్రయిస్తున్నా కనీసం కన్నెత్తి చూడడంలేదు. అధికారులు కాసులకు కక్కుర్తిపడి వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నా పట్టించుకునే నాథుడే లేదు. దీంతో రాష్ట్రాలు దాటి గుట్కా అమ్మకాలు చేపడుతున్నారు. ఆంధ్రాలో గుట్కా అమ్మకాలు, తయారీపై నిషేధం గత కొన్నేళ్లుగా ఉండడంతో పార్వతీపురం మన్యం జిల్లా అంతా పక్కనే ఉన్న ఒడిశాకు దగ్గర ఉండడంతో అక్కడి నుంచి జిల్లాలోకి ఇవి విచ్చలవిడిగా వస్తున్నాయి. పోలీసులు, చెక్ పోస్టులు ఉన్నా, అధికారులు అడుగుతారన్న భయం అక్రమదారులకు లేకపోవడంతో ఇదే అదునుగా ద్విచక్ర వాహనాలు, ఆటోలు, మినీవ్యాన్లపై ఒకేసారి లక్షల విలువైన సరుకులను తెచ్చి మారుమూల ప్రాంతాల్లోని గోడౌన్లలో నిల్వ ఉంచుతూ ప్రతిరోజు మోటార్ సైకిళ్లు, మినీవ్యాన్లపై కిరాణా షాపులకు, హోల్‌సేల్ వర్తకులకు యథేచ్ఛగా అమ్మకాలు సాగిస్తున్నారు.

గంజాయి నియంత్రణపైనే దృష్టి

ఒడిశాకు ఆనుకొని మన్యం జిల్లా ఉండడంతో ప్రతిరోజు పోలీసులు, ఇతర అధికారులు కేవలం గంజాయి పైనే దృష్టి పెట్టి, అక్రమ రవాణా జరగకుండా నిరోధించడానికి కృషి చేస్తున్నారు. ప్రజలకు కనిపించకుండా ఎన్నో రోగాలకు ముఖ్యంగా కేన్సర్, దంత సమస్యలు, నోటి పుండ్లు బారినపడి వేల మంది చనిపోతున్నా గుట్కా పట్ల పెద్దగా నిఘా పెట్టడం లేదు. రాష్ట్రంలో ప్రజలకు హాని చేసే పదార్థమైనందు వల్ల దీన్ని ఇక్కడ నిషేధించక పోవడంతో పక్కనే ఉన్న ఒడిశాలో తయారు చేసి అమ్మకాలను విపరీతంగా పెంచుకొనేందుకు వారు ప్రయత్నించడం, అక్కడి నుంచి ఆంధ్రాలోనికి విపరీతంగా అక్రమ రవాణా మార్గంలో ఇక్కడ ఉండే వ్యాపారులు తెచ్చుకొని కోట్లకు పడగలెత్తిన దాఖలాలు చాలా ఉన్నాయి. అయినా పోలీసులు, సంబంధిత అధికారులు దృష్టి పెట్టకపోవడంతో వీరు ఇదేపనిగా పట్టపగలే ప్రతి గ్రామంలోకి వచ్చి కిరాణా షాపులకు అందజేస్తున్నారు.

అమ్మకానికి సిద్ధంగా ఉంచిన గుట్కాలు

గుట్కాలకు బానిసైన యువత

ఏ మారుమూల ప్రాంతమైన యువత, మహిళలు, రోజువారి కూలీ చేసుకునే వారు నోట్లో గుట్కా లేకుండా ఉండడం లేదంటే అతిశయోక్తిగా కలగక మానదు. ప్రతి ఒక్కరూ దీన్ని నిత్యవసర వస్తువుగా వాడడంతో దీనికి డిమాండ్ పెరిగి 10రూపాయలకు దొరుకుతున్న ఈ గుట్కాను రూ.20కు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. ఎక్కువ ధర అయినా ప్రశ్నించకుండా ఏదోలా దొరుకుతుందనే కారణంతో ఎక్కువ ధర అయినా దీనికి చెల్లించి దీన్ని కొనుగోలు చేసి ప్రతి ఒక్కరూ వాడుకుంటున్నారు.

పట్టించుకోని అధికారులు

గుట్కా వినియోగం వల్ల ప్రజలకు హాని జరుగుతుందని, కేన్సర్ బారిన పడుతున్నందున ఈ పదార్థాన్ని వాడకుండా గతంలో మన ప్రభుత్వం నిషేధం విధించింది. అయినా సరే ఇక్కడ అధికారులు దీని గురించి గానీ, ఇది ఎక్కడి నుంచి వస్తుందో, ఎవరెవరు ఎక్కడికి తెస్తున్నారు, ఎక్కడ అమ్ముతున్నారన్న విషయాన్ని పట్టించుకోవడంలేదు. ఇది మత్తు పదార్థం కావడంతో యువత ఎక్కువగా ఆకర్షితులై దీన్ని ఉపయోగించుకుంటున్నారు. వ్యాపారులు కూడా దీన్ని ఎక్కువగా అమ్మకాలు సాగించడానికి ప్రతి షాపుల్లోనూ విచ్చలవిడిగా దీని అమ్మకాలు కొనసాగిస్తున్నారు. గుట్కాపై ఎక్కడా నిఘా లేకపోవడం, వాటి అమ్మకాలు సాగించడం వెనుక అధికారులకు ఏమైనా నెలనెలా మామూలు అందుతున్నాయా అన్న అనుమానాలను సర్వత్రా వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, పోలీసులు తక్షణమే స్పందించి అక్రమ గుట్కాను నిరోధించే బాధ్యతను తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యుత్ తీగ తగిలి కార్మికుడు మృతి

మక్కువ: మండల కేంద్రమైన మక్కువ బిసి కాలనీలో భవన నిర్మాణ పనిని పరిశీలించే క్రమంలో హెచ్‌డి విద్యుత్ తీగ తలకు తగలడంతో భవన కార్మికుడు అక్కడికక్కడే మృతి చెందిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. స్థానిక ఇంటి యజమాని మావుడి ఆనంద్ కుటుంబం తెలిపిన వివరాలు ప్రకారం, తన ఇంటి పైన పిట్టగోడలు మెట్ల డూమ్ పనులు కోసం చెప్పుబుచ్చంపేట పంచాయతీ పాలకవలస గ్రామానికి చెందిన పాల గౌరీశంకర్ (39) అనే భవన కార్మికుడు పనిని చేస్తున్నాడు. అందులో భాగంగా ఆదివారం ఇప్పటి వరకు జరిగిన ప్లాస్టింగ్ పనులను పరిశీలించేందుకు మేడ పైకి వెళ్లాడు. మెట్ల డూమ్ పనిని పరిశీలించేందుకు పిట్టగోడ ఎక్కడంతో పైనుంచి ఉన్న హెచ్‌డి తీగలు తగలడంతో కింద పడిపోయి మరణించాడు. మృతుడు గౌరీశంకర్‌కు భార్య పైడితల్లి, కుమారుడు, కుమార్తె పిల్లలు ఉన్నారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

సాలూరు రూరల్: అనారోగ్య కారణాలతో భార్య, పిల్లలకు గత కొంతకాలంగా దూరంగా ఉంటూ మనస్థాపానికి గురై తన ఇంటిలోనే ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సాలూరు పట్టణానికి చెందిన వ్యక్తి ఆదివారం మృతి చెందాడు. పట్టణంలో బంగారమ్మ కాలనీకి చెందిన జలుమూరు కొత్త రాజు (28) గత కొంతకాలంగా తన భార్య, పిల్లలకు దూరంగా ఉండటం వల్ల మద్యానికి బానిసయ్యాడు. దీంతో అనారోగ్యానికి గురై జీవితంపైన విరక్తి చెంది ఆదివారం ఉదయం 11 గంటలకు తన ఇంటిలోనే ఉరివేసుకొని మరణించాడు. సాలూరు టౌన్ ఎస్ఐ జి. శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారని పట్టణ సిఐ బి అప్పలనాయుడు తెలిపారు.

ఆకతాయిల మధ్య ఘర్షణ

ముగ్గురు సిఆర్‌పిఎఫ్ జవాన్లకు గాయాలు

మక్కువ: మండల కేంద్రం మక్కువ మేజర్ పంచాయితీలో ఆదివారం సాయంత్రం జరిగిన వారాల పండగలో ఆకతాయిల మధ్య స్వల్ప ఘర్షణ చోటు చేసుకుంది. ఈ సందర్భంగా జరిగిన రాళ్లదాడిలో ముగ్గురు సిఆర్పిఎఫ్ సిబ్బందికి స్వల్పంగా గాయపడినట్లు తెలిసింది. స్థానిక నాలుగు రోడ్లు కూడలిలో ఆకతాయిల మధ్య ఘర్షణ చెలరేగింది. దీనిని అప్పటికే పోలీసులు సద్దుమణిగింప చేశారు. ఊరేగింపుగా వెళుతున్న సందర్భంలో స్థానిక ఎస్‌సి వీధి మెయిన్ రోడ్డు రచ్చబండ సమీపంలో కొంతమంది గుర్తుతెలియని ఆకతాయిలు రాళ్ల దాడి జరిపిన నేపథ్యంలో సిఆర్‌పిఎఫ్ సిబ్బందికి గాయాలైనట్లు సమాచారం.